క్లుప్తంగా

7న మండల సర్వసభ్య సమావేశం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన ఎంపీపీ చెరుకూరి సతీష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అద్దూరి బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

8న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

ములుగు రూరల్: ఈ నెల 08వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించతల పెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో వంట కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.3వేలు ప్రకటించి ఇప్పటికి అమలు చేయడం లేదని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన మెస్ చార్జిలను పెంచకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహా ధర్నా కార్యక్రమానికి వంట కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సామల రమ, గున్నాల రాజకుమారి, కమలక్క, ప్రమీల, సమ్మక్క, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేయండి

కాటారం: ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయాలని జిల్లా హెల్త్ అసిస్టెంట్ల సంఘం నాయకులు రాజు, సమ్మయ్య, రాజారాం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ ఉద్యోగిగా పని చేస్తున్న మధు ఆత్మహత్య చేసుకోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మధు మృతిపై సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో, సమయానికి జీతం అందక కాంట్రాక్ట్ ఉద్యోగులు కుటుంబ పోషణ భారమై జీవితాలను గుడుపుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమ కాంట్రాక్ట్ ఉద్యోగుల బాధలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మొగుళ్లపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతుగల్లు వాగు నుంచి ఇప్పలపల్ల గ్రామానికి చెందిన దూడపాక రాములు శుక్రవారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి



మహదేవపూర్: ప్రస్తుత సమాజంలో యువతి, యువకులు సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని కుదురుపల్లి గ్రామంలో సైబర్ క్రైమ్‌పై శుక్రవారం అవగాహన కల్పించినారు. ఏవరైనా అపరిచితులు ఫోన్‌లు చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, తిరుపతి, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన



మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని జెడ్పీ సీఈఓ రఘువరన్ శుక్రవారం తనిఖీ చేశారు. మొక్కలు పెరిగే విధంగా నీళ్లు, ఎరువులు చల్లాలని ఇలాంటి చీడపీడలు పట్టకుండా ఎప్పటికప్పుడు పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ నాయక్, ఏపీఓ రమేశ్ పాల్గొన్నారు.

సన్మానం

మల్హర్: మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అజ్మీర సమ్మయ్య నాయక్‌ను ఆ సంఘం నాయకులు మండల కేంద్రం తాడిచర్లలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్, జగన్‌నాయక్, బోడ బాలజీనాయక్, అయ్యూబ్‌ఖాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



రొయ్యూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచోత్కులపల్లి సర్పంచ్ మాలోత్ రవీందర్ అన్నారు. శుక్రవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంచోత్కులపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించామని అన్నారు. గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్, అప్తమాలిక్ వినయ్, డీఈఓ మమత, హెల్త్ సూపర్‌వైజర్ ఉష, ఏఎన్ఎంలు కేశబాయి, సుజా, ఆశాలు కవిత, రజిత, శ్యామల, స్వర్ణ, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు మాషిపెద్ది పుష్పమ్మ, ఉప సర్పంచ్ సుమతి, వార్డు సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని తహసీల్దార్ సంజీవ, ఎంపీడీఓ కుమార్‌లు శుక్రవారం తనిఖీ చేశారు. కంటి శిబిరంలో ఇప్పటి వరకు ఎంత మందికి పరీక్షలు చేశారని అక్కడ విధుల్లో ఉన్న వైద్యాధికారి సుమలతను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి ఎక్కువ మంది వచ్చే విధంగా చొరవ చూపాలని సర్పంచ్ జిట్టె సమత ఈశ్వర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆఫాల్మిక్ అధికారి దిలీప్, సీహెచ్ఓ శారద, ఏఎన్ఎం ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

వెదజల్లే పద్ధతితో అధిక లాభాలు



రైతుకు అవగాహన కల్పిస్తున్న మహేష్

మల్హర్: రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ అన్నారు. మండలంలోని కొయ్యూరు గ్రామంలో శుక్రవారం మహేష్ వెదసాగుపై క్షేత్రస్థాయి ప్రదర్శన, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారుమడి పద్ధతిలో ఎకరాకు 25 నుంచి 30 కిలోల విత్తనం అవసరంతో పాటు పెరగడానికి 30 రోజుల సమయం పడుతుందన్నారు. నారుమడికి ఎకరానికి 2వేలు, వరి నాటుకు కూలీలకు రూ.6వేలు ఖర్చువుతుందని పేర్కొన్నారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేయడానికి ఎకరానికి 8 నుంచి 10 కిలోలు పడుతుందన్నారు. కూలీల ఖర్చు అవసరం లేకుండా ఒక వ్యక్తి రోజుకు మూడు ఎకరాలు విత్తనం వేసుకోవచ్చని, ఎకరానికి రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు మిగులుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మనీషా, శిరీష, అనుషా, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలం రామన్నగూడెంలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. బాధితురాలు పర్శ లక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ప్రమాదవశత్తు ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో లక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. అంతలో ఇంట్లోని గ్యాస్ లీకవడంతో మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.50వేల నగదు, బట్టలు, బియ్యం, రెండు తులాల బంగారం, ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ నరేశ్ ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

తప్పిపోయిన భక్తుల అప్పగింత



శిబిరాల్లో సేవలందిస్తున్న అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో తప్పినపోయిన భక్తులను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల ద్వారా ఈ మూడురోజుల్లో జాతరకు వచ్చి తప్పినపోయిన 116 మంది భక్తులను చేరదీసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ శిబిరాలను ఐటీడీఏ జేసీడీఓ పెనుక సుగుణ ఇన్‌చార్జ్‌గా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం 39 మంది భక్తులు ఈ శిబిరాలను ఆశ్రయించగా వారి కుటుంబ సభ్యులు అప్పగించినట్లు తెలిపారు. 24 గంటలు పాటు అధికారులు అందుబాటులో భక్తులకు సేవలందిస్తున్నారు. ఈ శిబిరాల్లో డీడబ్ల్యూఓ హేమలత, సీడీపీఓ మల్లీశ్వరి, సీసీఐ కౌన్సిలర్ రాణి, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ జయసుధ ఉన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి



గోవిందరావుపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సీతక్క



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న దేవేందర్



మంగపేట: రాజుపేటలో..

ములుగు రూరల్(గోవిందరావుపేట): వనదేవతల దీవెనెలతో టీపీసీసీ అధ్యక్షుడు రేవత్‌రెడ్డి ఈ నెల 06వ తేదీన ప్రారంభిస్తున్న హాథ్‌సేహాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సీతక్క పిలుపునిచ్చారు. శుక్రవారం గోవిందరావుపేట మండలకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. భారత్ జోడో యాత్ర ద్వారా 15 రాష్ట్రాలలో 136 రోజులు 4వేల కిలోమీటర్లు నడిచి దేశాన్ని ఐక్యం చేస్తూ, సమస్యలను తెలుసుకుంటు నిర్వహించిన రాహుల్‌గాంధీ జోడో యాత్రను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో దొరల పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. నీళ్లు, నిధులు, నియమకాల పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. ఇందిరమ్మ రాజ్యం నెలకొల్పడమే లక్ష్యంగా యాత్ర సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి కుచన రవళి, టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, ఎల్లారెడ్డి, సీతారాం నాయక్, సుధాకర్, కన్నయ్య పాల్గొన్నారు.

ఏటూరునాగారం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 6న మేడారం నుంచి చేపట్టబోయే హాథ్‌సేహాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు మద్దతుగా ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖలీల్, ఆయూబ్, బాలరాజు, నర్సింహరావు, ఎల్లయ్య, శ్రీలత, దేవేందర్, రాధిక, పోషయ్య, సులేమాన్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధి నుంచి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న హాథ్‌సేహాథ్ జోడో యాత్ర విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు బొల్లు దేవేందర్, మండల అధ్యక్షుడు జాలపు అనంతారెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సీతక్క అదేశాల మేరకు రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని కావున ప్రతి ఒక్క కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, జిల్లా నాయకులు ఆరెం లచ్చు పటేల్, స్థానిక సర్పంచ్ ఇర్స సునిల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, రంగరబోయిన జగన్, నాయకులు రాంబాబు, శ్రీనివాస్, వెంకన్న, నర్సింహులు, రాజిరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగపేట: మేడారం సమ్మక్క–సారక్క సన్నిధి నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న హాథ్‌సేహాథ్ జోడో యాత్ర, సాయంత్రం పసరలో జరిగే బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రాజుపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జయరాంరెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మీ, కిసాన్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లెపల్లి శివయ్య, బ్లాక్ కార్యదర్శి రామిరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పల్లికొండ యాదగిరి, సమ్మయ్య, రాజారత్నం, బాలకృష్ణ పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న గుడిసెవాసులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా శివారులో గల 109 సర్వే నంబర్‌లో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ అన్నారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుడిసె వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతంలో కనీస వసతులు కల్పించాలని అన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు పక్క ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చర్చించి గుడిసెవాసులకు హక్కుపత్రాలు అందించాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మికులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, తీగల ఆదిరెడ్డి, పాదిళ్ల చిట్టిబాబు, అంబాల పోషాలు, నాగరాజు, రామస్వామి, రమేష్, రాజు, రాజేశ్వరి, శారద, మురళి, అరుణ, రాంబాబు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రామగిరి సారంగపాణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సమ్మయ్య, సారయ్య, హరిసింగ్, భద్రు, రమేష్, లక్ష్మణ్, సంధ్య ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గఫూర్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాకేంద్రంలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను అభివృద్ధి పేరుతో వెనిక్కి తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్జద్‌పాషా, బోడ రమేష్, రత్నం ప్రవీన్, పురుషోత్తం, తిరుపతి, రాజేశ్వరి, నగేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): అర్హులందరికీ డబుల్ బెడ్రూంలను ఇళ్లను ప్రకటించాలని రేగొండ మండలంలోని నిజాంపల్లి మహిళలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ షరీఫ్‌మొహినొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుపేదలకు, గూడులేని వారికి డబుల్ బెడ్రూంలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేత

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల రజనీకాంత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సమ్మయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం



యాత్రలో పాల్గొన్న సత్యనారాయణరావు, నాయకులు

భూపాలపల్లి రూరల్: రానున్న రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని టీపీసీసీ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సత్యనారాయణరావు చేపట్టిన హాథ్‌సేహాథ్ జోడోయాత్ర శుక్రవారం నాటికి తొమ్మిదవ రోజుకు చేరుకుంది. పట్టణంలోని 19వ వార్డు ఎల్‌బీనగర్‌లో బట్టు శ్రీలత కర్ణాకర్ ఆధ్వర్యంలో ఆయనకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాంతినగర్, గాంధీనగర్, భానోత్ వీధి, లక్ష్మినగర్, హనుమాన్ నగర్‌లలో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను జిల్లా అధ్యక్షుడు ఐయితప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సత్యనారాయణరావు మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. సింగరేణి ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఈ యాత్రలో పార్టీ వార్డుల నాయకులు మట్టెవాడ సురేష్, అజ్మీరా తిరుపతి, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, నాయకులు అంబాల శ్రీనివాస్, చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య పాల్గొన్నారు.

రెండో రోజు తప్పని కరెంటు కష్టాలు

మంగపేట: మండలంలో రెండో రోజు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో విద్యుత్ వినియోగాదరులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కమలాపురం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని మల్లూరు 33/11 కేవీ విద్యుత్ లైన్ లింబులపై గురువారం కోతి దూకిన సంఘనతో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో తాడ్వాయి మండలం కాటాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తాడ్వాయి 33 కేవీ విద్యుత్ లైన్ లింబు ఫెయిల్ కావడంతో సరఫరాలో సమస్య తలెత్తింది. రైతులు, సామాన్య ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఈ మల్హూర్, డీఈ పులసం నాగేశ్వర్‌రావు, ఏఈ ప్రశాంత్‌లు మరమ్మతులు చేపట్టి ఎట్టకేలకు రాత్రి 07 గంటలకు పునరుద్ధరించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

చిట్యాల: పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని సీడీపీఓ అవంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో చిట్యాల సెక్టార్ అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ అవంతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులకు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందించాలని కోరారు. పుట్టిన నుంచి 5 సంవత్సరాల వరకు పిల్లల బరువులు చూసి పోషణలోపం గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ సేవలు, హక్కులు, టోల్ ఫ్రీ నంబర్స్‌తో కూడిన బోర్డుని టీచర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయప్రద, చిట్యాల సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు



ఉత్సవాలకు హాజరైన భక్తులు

టేకుమట్ల: మూడు రోజులుగా మండల కేంద్రంలో కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారం భూలక్ష్మీ, మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపనతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలను ప్రధానార్చకులు పురాణం రఘునందన్‌శర్మ వేద మంత్రోచ్చరణలు, మేళ తాళాల మధ్య బొడ్రాయి, భూలక్ష్మీ, మహాలక్ష్మీ, పోచమ్మ, కనకదుర్గమ్మ, పోతరాజు ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, స్థానిక సర్పంచ్ పొలాల సరోత్తం రెడ్డి, ఎంపీటీసీ ఆది సునీతరఘు, ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శివకేశవ ఆలయంలో ధ్వజారోహణం

టేకుమట్ల: మండలంలోని వెలిశాల పురాతన ఆలయమైన శ్రీ శివకేశవ ఆలయంలో ధ్వజారోహణ, సీతారామాంజనేయ, గణపతి, నందీశ్వర, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం కొనసాగింది. ఉదయం యంత్రస్థాపన, జీవన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, కళాహోమాలు, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అగ్ని ఉద్వాసన, కుంభాభిషేకం వంటి కార్యక్రమాలను వేద పండితులు తనుగుల శ్రావన్ కుమార్, వెంకన్నశర్మ, మణికంఠశర్మ, నాగేంద్రశర్మలు వేదమంత్రాలు, మేళతాలాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం కుంకుమార్చన కార్యక్రమం అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు గండ్ర సత్యనారాయణరావు, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, స్థానిక సర్పంచ్ చింతలపెల్లి విజయాస్వామిరావు, ఆలయ చైర్మన్ దామరవేని నారాయణరావు, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఆలయ ధర్మకర్తలు పింగిళి నారాయణరెడ్డి హాజరైయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన శరత్, సర్వేశ్వరావు

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గా యాలైయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్ర కారం.. మండల పరిధిలోని ఆర్లగూడెం గ్రామానికి చెందిన సర్వేశ్వరావు, శరత్ ఇద్దరు సలుబాక నుంచి గురువారం రాత్రి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో జగన్నాథపురం జంక్షన్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.